సాక్షి గుంటూరు

శుక్రవారం । 13 । జనవరి । 2023

I

సత్తెనపల్లిలో
వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీల ముగింపు ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విజేతలను మంత్రి అంబటి రాంబాబు ప్రకటించారు. ప్రథమ బహుమతి పొందిన తిరుపతమ్మకు రూ.2లక్షలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.
- సత్తెనపల్లి

ముగ్గు వద్ద ప్రథమ బహుమతి సాధించిన తిరుపతమ్మ





న్యూస్‌రీల్

వేగంగా భూముల రీ సర్వే: కలెక్టర్

గుంటూరు వెస్ట్: జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియ వేగంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర సీసీఎల్ఏ కార్యాలయం నుంచి గురువారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.

ప్రైవేట్ ట్రావెల్స్ నిబంధనలు పాటించాలి

పట్నంబజారు: ప్రైవేట్ ట్రావెల్స్‌కు సంబంధించిన వాహనాలను ఆర్టీసీ బస్టాండ్‌కు రెండు కిలోమీటర్ల పరిధిలో నిలపరాదని డీటీసీ షేక్ కరీం చెప్పారు. ఈ మేరకు స్వర్ణభారతినగర్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు, టికెట్ బుకింగ్ ఏజెంట్లతో సమవేశం నిర్వహించారు. డీటీసీ కరీం మాట్లాడుతూ ఆర్టీసీ టికెట్ ధరలకు అనుగుణంగా ప్రైవేట్ ట్రావెల్స్ ఛార్జీలు వసూలు చేయాలని సూచించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సులు నిలుపుదల చేసి ప్రయాణికులను ఎక్కించుకోరాదని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు చర్యలు

- సీనియర్ ఎస్జీటీలను నెలకు రూ.2,500 అలవెన్సుతో నియామకం
- నేడు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్

గుంటూరుఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అవసరమైన సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం సీనియార్టీ కలిగిన ఎస్జీటీలను స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో తాత్కాలిక ప్రాతిపదికన నియమించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ పి.శైలజ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో పనిచేసేందుకు అర్హత గల ఎస్జీటీలను నెలకు రూ.2,500 అలవెన్సుపై నియమించేందుకు శుక్రవారం గుంటూరులోని డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గతేడాది అక్టోబర్‌లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్, గణితం, బయాలాజికల్ సైన్స్ ఉద్యోగోన్నతుల కోసం విల్లింగ్ ఇచ్చిన ఎస్జీటీలు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. ఉదయం 10 గంటలకు ఇంగ్లీష్, మధ్యాహ్నం 2.00 గంటలకు గణితం, బయాలాజికల్ సైన్స్ అభ్యర్థులకు జరగనున్న కౌన్సెలింగ్‌కు సంబంధిత ఉపాధ్యాయులు హాజరయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలని డీవైఈఓ, ఎంఈఓలను డీఈఓ ఆదేశించారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1216 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 64, తూర్పు కెనాల్‌కు 30, నిజాంపట్నం కాలువకు 125, కొమ్మమూరు కాల్వకు 613 క్యూసెక్కులు విడుదల చేశారు.

యార్డుకు 67,060 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 67,060 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 63,028 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాళ్లకు రూ.14,000 నుంచి రూ.25,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.13,000 నుంచి రూ.22,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 34,835 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2000, గరిష్ట ధర రూ.3100, మోడల్ ధర రూ.2500 వరకు పలికింది.

తుళ్లిపడుతున్న పల్లెలు

- సంక్రాంతికి సొంతూళ్లకు..
- నగరాలు, పట్టణాల నుంచి రాక
- పిల్లాపాపలతో కళకళలాడుతున్న పల్లెటూళ్లు
- అందరి మధ్య పండుగ కోసం ఉవ్విళ్లూ..
- కిటకిటలాడుతున్న బస్టాండ్‌లు...రైల్వే స్టేషన్లు





సంక్రాంతి పండక్కి సొంతూరుకి, యూకే నుంచి భర్త గ్లేహోర్డ్ క్లింగ్‌తో కలిసి వచ్చిన అరవింద మీరా



తమ బిడ్డలకు స్వాగతం చెప్పేందుకు పల్లెటూళ్లు నిజంగా బంతి పూల వనాలవుతున్నాయి. ఊరికంటే ముందు ముంగిళ్లు రంగ వల్లులవుతున్నాయి..పసుపు కుంకుమలు, గొబ్బెమ్మలతో మరింత సొగసును అద్దుకుంటున్నాయి... 'రమా రమణ గోవిందో హరి' అనుకుంటూ వచ్చే హరిదాసులు...అపర నందీశ్వరుడిని పోలిన గంగిరెద్దులు, సన్నాయి, డోలు వాద్య కారులూ...అబ్బా తలచుకుంటూనే మనసు తుళ్లిపడుతుంటుంది. ఇది కదా సం'క్రాంతి' అనిపిస్తోంది.



కిటకిట..గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

తెనాలి: ధనుర్మాసం నుంచి సంక్రాంతి వరకు పల్లెసీమల్లో పండుగ వాతావరణం అలుముకుంది. అందుకే ఉద్యోగం, వ్యాపారీత్యా హైదరా'బాద్'ల్లో ఉన్నా, ఇంకే మెట్రో నగరంలో స్థిరపడినవారంతా సంక్రాంతి పండక్కి పల్లెను విస్మరించలేని బలహీనతతో ఉంటారు.

తెలుగువారి పండుగల్లో సంక్రాంతి విశిష్టమైంది...పండక్కి సెలవులొచ్చేశాయ్...పట్టణాలు, నగరాల్లోని ఇళ్లలో ఒకటే హడావుడి...నానా హైరానా పడి ఇంటిల్లపాదికీ టికెట్లను రిజర్వు చేయటం ఓ ప్రయాస. షాపింగ్ సందడి...కావాల్సిన సరంజామా సర్దుకోవటం, ఏదైనా తగ్గితే మళ్లీ బజారుకెళ్లటం...ఇందంతా సంక్రాంతికి సొంతూరుకెళ్లే ముచ్చట! 'గోరింటాకుతో పండిన రెండు చేతులకూ గాజులు వేసుకుంటేగానీ పండుగ కాదనుకునేవారు ఆడపిల్లలు. వయసొచ్చిన ఆడపిల్లలు లంగావోణీల మెరుపుల ముచ్చట్లతో కుందనపు బొమ్మలవుతారు...వడ్డాణం, అరవంక, బుట్టలు, కాసులహారం, ఆభరణాలు...వారి అందాన్ని ఇనుమడింపజేస్తాయి. ఆ తలపులతోనే సొంతూరులోని ఇల్లు చేరుకుంటారు మహిళలు. సొంతూరు ఇంతకు ముందులా అందంగా లేదు. వ్యవసాయ చట్రంలోంచి మనుషులు వెళ్లిపోయాక రైతు కూలీల అనుబంధం కొరవడింది. నాటి ఉమ్మడి బతుకుల కళాకాంతులూ, ప్రేమ ఆప్యాయతల పరిమళాలు తగ్గిపోయాయి. విశాలమైన ఖాళీ స్థలాలు, అందులో గంగరావి, జామ, మామిడి, మునగ, బొప్పాయి, కొబ్బరిచెట్లు ఇప్పుడు లేవు. పూరిళ్లు ఇరుకిరుకు వాటాలయ్యాయి. ఇంటిముందు పిచ్చుకలకు కట్టే పాల కంకుల్లేవు. రామచిలుకలు రావటం లేదు. పండక్కి ముగ్గులే కాదు, భోజనాలు...అన్నీ మొక్కుబడిగానే. కొబ్బరాకులతో బూరల బొమ్మలు, కోతికొమ్మచ్చి, బొంగరాలాట, తొక్కుడు బిళ్ల, వైకుంఠపాళి, చింతగింజలాటలకు పిల్లలకు తీరికలేకుండాపోయింది. ఖాళీ సమయాన్ని టీవీ, మొబైల్ ఫోను ఆక్రమించింది. పండుగ రోజుల్లో ఆత్మీయతలను కలగలపుకోకుండా స్పెషల్ మూవీ ధమాకాలపై మనసు పోతోంది. కాలంతో వచ్చిన ఆధునికతతో పల్లెటూరు స్వరూపం మారింది. అయినప్పటికీ ఊరు వెళ్లాలి...అక్కడ మమతల అమ్మ ఉంది...ఆ మాతృమూర్తిలానే జీవిత మాధుర్యాన్నీ, ఆత్మీయతల్నీ పంచిన ఊరుకు వెళ్లకపోతే అదొక దిగులు అందుకే ఊరు వెళుతున్నామంటే ఎక్కడలేని ఆనందం... అందుకు సంక్రాంతి పండక్కి ఊరు పిలుస్తోంది... అనుకుంటూ వేలు, లక్షల మంది తీరిక చేసుకుని నగరాలు, పట్టణాల నుంచి బయలుదేరారు. కిటకిటలాడుతున్న బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, అదనపు రైళ్లు, బస్సులే ఇందుకు సాక్ష్యం!

> 'కోడి కూతతోనే మేల్కొనేవారం ...కసవు చిమ్మి , కళ్లాపు చల్లిన వాకిలిలో ముగ్గులు వేసేవాళ్లం...ఎదురింటి మహాలక్ష్మి, పక్కింటి సరోజకన్నా పెద్ద ముగ్గు వేయాలనీ, గొబ్బెమ్మలు పెట్టాలనీ, సూర్యరథం వేయాలని పోటీలు పడేవాళ్లం' అనుకుంటూ మహిళలు యుక్తవయసులోని మధుర స్మృతులను గుర్తు చేసుకుంటున్నారు.

రైతు సంఘటితం..
ఉత్పత్తులు శ్రేష్ఠం

రైతే రాజు
- 300 మంది రైతులతో శ్రేష్ఠ ఫార్మర్స్ కంపెనీ
- నిర్మాణం పూర్తికావచ్చిన ఉత్పత్తుల సేకరణ కేంద్రం
- త్వరలో కోల్డ్ స్టోరేజి నిర్మాణం
- అంతర్జాతీయ కంపెనీల సాంకేతికతతో పంటల సాగు



కొల్లిపరలో శ్రేష్ఠ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్



ఆర్గానిక్ ప్యాకెట్లు



కుటుంబరెడ్డి, గోపాలరెడ్డి, సాంబిరెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వ్యవసాయం దండుగ అనే రోజుల నుంచి వ్యవసాయం పండుగ అనే రోజులు వస్తున్నాయి. రైతులే సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయంతోపాటు మార్కెటింగ్‌లోకి కూడా అడుగు పెడుతున్నారు. ఈ భావనే రైతు ఉత్పత్తి కంపెనీ ఆవిర్భావానికి దారితీసింది. జిల్లాలోని కొల్లిపరలో 'శ్రేష్ఠ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్' (శ్రేష్ఠ ఫామ్స్)గా ఏడాది కిందట ఆరంభమైన రైతుల కంపెనీ, స్థిరమైన వ్యవసాయ పద్ధతుల కోసం సాంకేతికతతో నడిచే వ్యవస్థలను అందిపుచ్చుకుంది. విజయయాత్రలో వడివడిగా అడుగులు వేస్తోంది. 15 వేల జనాభా, 5,500 ఎకరాల వ్యవసాయ భూమిలో పసుపు, అరటి, మొక్కజొన్న, వరి పంటలు పండించే కొల్లిపర మండల కేంద్రంలో 300 మంది సభ్యులతో ఆవిర్భవించిన శ్రేష్ఠ ఫామ్స్ ఏడాది వ్యవధిలోనే విలువైన విజయాలను అందుకుంది. కేంద్రప్రభుత్వంచే 'స్టార్టప్ ఇండియా' సర్టిఫికేషన్‌ను సాధించింది. కంపెనీ రైతుల సాగులో వెయ్యి ఎకరాలుండగా, వీటిలో 100 ఎకరాల్లో ప్రకృతి పద్ధతుల్లో వరి, ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఆయా ఉత్పత్తులను సేకరించి, ప్రాసెసింగ్‌తో కందిపప్పు, మినప గుళ్ల, మినప్పప్పు, కారం, పసుపు, రాగి పిండి, జొన్న పిండిగా మార్కెట్ చేస్తున్నారు. ఖర్చులు తగ్గించేందుకు శ్రేష్ఠ ఇన్‌పుట్ విభాగం రైతులకు మట్టిని సిద్ధం చేయటం, సరైన విత్తనం, అవసరమైన ఎరువులు, పురుగుమందులు అందించటం, పిచికారీ చేయటాన్ని పర్యవేక్షిస్తోంది. పంటల ఉత్పత్తుల నిల్వ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్‌ను ప్రాసెసింగ్ విభాగం చూస్తుంది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం, వాట్సాప్, ప్రత్యక్ష మార్కెట్, రిటైల్ స్టోర్స్‌లో విక్రయాలు చేస్తున్నారు. ఎరువులు, పురుగుమందులను సేకరించి రైతులకు విక్రయిస్తున్నారు. 2021 నవంబరులో ఏర్పాటైన కంపెనీ తొలి ఏడాది రూ.10 లక్షలు, 2022లో రూ.40 లక్షల టర్నోవర్‌ను సాధించిందని కంపెనీ చైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి చెప్పారు. డైరెక్టర్లు దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి (సమన్వయం),బొంతు గోపాలరెడ్డి (ఇన్‌పుట్స్), ఉయ్యూరు సాంబిరెడ్డి (ప్రాసెసింగ్), నెర్ల జ్యోతి (మహిళా సాధికారత) వివిధ బాధ్యతలు పంచుకున్నారు.

దత్తత తీసుకున్న యూనివర్సిటీ

ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం శ్రేష్ఠ ఫామ్స్‌ను దత్తత తీసుకుంది. ఆహార ఉత్పత్తులకు ఆర్డర్లు ఇవ్వటమే కాకుండా కొత్త వంగడాలు రిలీజ్ కాగానే మినీ కిట్లను కంపెనీకి ఇస్తారు. మదర్ సీడ్ ఉత్పత్తి కాగానే తిరిగి విశ్వవిద్యాలయం కొనుగోలు చేసి, ఇతర రైతులకు అందించనుంది.

మరో విశిష్టత ఏమంటే 'బ్లూ నంబర్ ఫౌండేషన్' (న్యూయార్క్)తో ఏపీలో రైతులకు డిజిటల్ గుర్తింపు నంబరు కలిగిన తొలి రైతు ఉత్పత్తి కంపెనీ శ్రేష్ఠ.

ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాలనూ 'శ్రేష్ఠ' అందిపుచ్చుకుంది. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో మంజూరుచేసిన రూ.15 లక్షలతో కలెక్షన్ సెంటరు నిర్మాణం పూర్తికావస్తోంది. ఇందులో పంటల ప్రాసెసింగ్, ప్యాకింగ్‌కు మిషనరీకి రూ.3.5 లక్షల సబ్సిడీతో రూ.10 లక్షలు మంజూరయ్యాయి. కోల్డ్ రూమ్‌కు సబ్సిడీతో ఉద్యానశాఖ సమకూర్చిన రూ.12 లక్షలతో కోల్డ్ రూమ్ రాబోతోంది.

సాగులో సాంకేతికత

పంటల సాగుకు వివిధ విదేశీ/స్వదేశీ సాంకేతిక సంస్థల భాగస్వామ్యం తీసుకున్నారు. 'ఏరో స్పేషియల్' కంపెనీలో డ్రోన్ సాయంతో ఎరువులు, పురుగుమందుల పిచికారీ చేయిస్తున్నారు. 'ఫుడ్ లెన్స్' సంస్థ ఏపీలో తొలిసారిగా శ్రేష్ఠ ఫామ్స్‌లో రైతులు సాగుచేసే పసుపు పంటకు శాటిలైట్ మ్యాపింగ్ చేసింది. పంటకు సంబంధించి వారం వారం శాటిలైట్ ఫొటోలు రైతులకు సంబంధిత యాప్‌లో వస్తుంటాయి. పంట ఎలా ఉంది? దెబ్బతింటే ఎలాంటి మందులు వాడాలి? అనేది సూచిస్తుండటం ప్రత్యేకత!

మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరువెస్ట్: పేద విద్యార్థుల ఆకలి తీర్చే మధ్యాహ్న భోజనం జగనన్న గోరుముద్ద పథకంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం 80 శాతం కంటే తక్కువగా తీసుకున్న వారిని గుర్తించి కారణాలను విశ్లేషించాలన్నారు. లోపాలను సరిచేసి నూరు శాతం తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పిల్లలకు కోడిగుడ్లు, చిక్కీలు సకాలంలో అందే విధంగా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

పాఠశాలలకు రాకుండా ఉండే పిల్లలను గుర్తించి వారిని తిరిగి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాల నివారణ కోసం అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులు ప్రతి నెలా నిర్దేశించిన తేదీల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు చేపట్టాలన్నారు. జిల్లాలో 10 నుంచి 19 సంవత్సరాల మధ్య విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారికి పౌష్టికాహారం అందించాలన్నారు. తాడేపల్లి మండలం చిన్నరావూరును రక్తహీనత లేని గ్రామంగా తీర్చిదిద్దడానికి పైలట్ ప్రాజెక్ట్‌గా గుర్తించామన్నారు. ఈ గ్రామంలో ఉన్న బాలబాలికలకు, మహిళలకు యువతులకు పూర్తిస్థాయి రక్తపరీక్షలు నిర్వహించి, రక్తహీనత గుర్తించిన వారికి పౌష్టికాహారం అందించాలన్నారు. పాఠశాలల్లో జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న షెడ్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. దీంతోపాటు పెండింగ్ పనులు పూర్తిచేసి అందజేయాలన్నారు. ముఖ ఆధారిత హాజరు నూరు శాతం జరగాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి, సీపీఓ శేషశ్రీ, డీఈఓ శైలజ, డీపీఓ ఆర్.కేశవరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వీవీఐటీ విద్యార్థుల జాతి సమైక్యతా నడక

33 కిలోమీటర్లు దర్గా టు దుర్గా



మస్తాన్ దర్గా నుంచి కనకదుర్గ ఆలయం వరకు కాలినడక చేపట్టిన వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి

పెదకాకాని: విద్యార్థుల్లో ఐకమత్యం పెంపొందించి సమైక్యత చాటేందుకు దర్గా టు దుర్గా నడక దోహదపడుతుందని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని గురువారం దర్గా టు దుర్గా నడక చేపట్టారు.

వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకొని ముందుకు సాగాలన్నారు. భిన్నత్వంలో ఏకత్వం తెలియపరచేలా విద్యార్థులకు ఈ నడక పోటీలు దోహదపడతాయన్నారు. యువత దేశం పట్ల భక్తి భావంతో మెలగాలని వివేకానందుని స్ఫూర్తితో లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచనలు చేశారు. వీవీఐటీ విద్యార్థులు 12వ జాతి సమైక్యత నడక ఉదయం 5:30 గంటలకు గుంటూరు మస్తాన్ దర్గా నుంచి నడక ప్రారంభించారు. గుంటూరులోని హజరత్ కలేషా మస్తాన్ దర్గా నుంచి జైన్ టెంపుల్, డోలాస్‌నగర్, చర్చి మీదుగా విజయవాడ దుర్గ గుడి వవరకూ 33 కిలోమీటర్లు మేర సాగిన ఈ నడకలో కళాశాలకు చెందిన రెండు వేల మంది విద్యార్థిని విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విభాగాల క్యాడెట్స్ పాల్గొన్నారు. కళాశాలకు చెందిన అధ్యాపకేతర సభ్యుడు నంబూరు మణికుమార్, అల్లూరి సీతారామరాజు వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. మార్గంమధ్యలోని దేవాలయాలు, చర్చిలలో విద్యార్థులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె గిరిబాబు. డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎన్ కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతు క్షేమమే వ్యాపారుల సంక్షేమం



దిగుమతి సంఘం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, వేదికపై ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మేయర్ కావటి

- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- గుంటూరులో ఘనంగా చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ దిగుమతి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కొరిటెపాడు(గుంటూరు): రైతుల సంక్షేమంలోనే వ్యాపారుల క్షేమం ఉంటుందని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. ది గుంటూరు చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ దిగుమతి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించారు. మిర్చి యార్డు ఆవరణలోని శ్రీ వరశిద్ధి వినాయక దేవస్థానం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన లేళ్ల అప్పిరెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి రామారావు, కార్యదర్శి దాది నరేంద్రబాబు, సహాయ కార్యదర్శి షేక్ కరీముల్లా, కోశాధికారి కర్పూరపు కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి దిగుమతి సంఘం మాజీ అధ్యక్షుడు కుర్రి సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ మిర్చియార్డు, దీనికి అనుసంధానమైన రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, కూలీలతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని చెప్పారు. నూతనంగా ఎన్నికైన దిగుమతి సంఘం కార్యవర్గం దీన్నొక పదవిలా కాక బాధ్యతగా స్వీకరిస్తానని చెప్పారు. గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ఏకగ్రీవ ఎన్నిక ద్వారా తామంతా ఒకటే కుటుంబమని చాటి చెప్పిన దిగుమతి సంఘం సభ్యులను ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారాన్ని మరింతగా అందిపుచ్చుకుని వ్యాపార విస్తృతిని పెంచి రైతులకు లాభం చేకూర్చాలని సూచించారు. మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చొరవతోనే ది చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ దిగుమతి సంఘం ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు చెప్పారు. జీడీసీసీ బ్యాంకు చైర్మన్ లాలుపురం రాము మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన గుంటూరు మిర్చి యార్డులో ప్రతి పదవి కూడా ఎంతో కీలకమని తెలిపారు. కార్యక్రమంలో ఆలిండియా చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెలగపూడి సాంబశివరావు, ఎగుమతి సంఘం అధ్యక్షుడు జుగిరాజు, కోల్డ్ స్టోరేజీల అసోసియేషన్ కార్యదర్శి సురేంద్రబాబు, చిల్లీ పౌడర్ మిల్స్ అసోసియేషన్ కార్యదర్శి వై.అనిల్, కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి, దిగుమతి సంఘం మాజీ అధ్యక్షుడు కొత్తూరి సుధాకర్, వేమెన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

- ముగిసిన వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేత
- ఏటా నిర్వహించడం ఆనందదాయకం: రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి

సత్తెనపల్లి: నిత్యం రాజకీయాలు .. విమర్శలే కాక ప్రజలను ఉత్సాహ పరచాలనే ఉద్దేశంతో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని సుగాలీ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు గురువారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సంప్రదాయ బద్ధంగా ప్రజల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజల అందరిని ఉత్సాహ పరిచేందుకు లక్కీడిప్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. దీనివల్ల రూ.కోట్లు గడించాలని కాదని చెప్పారు. ఐదేళ్లుగా సంక్రాంతి సంబరాలను కొనసాగిస్తూ మహిళలను భాగస్వాములను చేయడం జరుగుతుందని చెప్పారు. తొలి ఏడాది మూడు వేల మందితో ప్రారంభమై నేడు 9,444 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో భాగస్వాములు అయ్యారన్నారు. ప్రజలందరినీ ఉత్సాహపరిచేందుకు లక్కీడిప్ పెడితే కొంత మందికి మాత్రం కడుపు మంటగా ఉందని అలాంటి వాటిని తాను లెక్కచేయనన్నారు. ప్రజలందరూ పండుగల సమయంలో ఉత్సాహంగా ఉల్లాసంగా గడపాలని, సంక్రాంతి తెలుగువారి పెద్ద పండుగ అన్నారు. వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ సంస్కృతి అందరిని కలుపుతుందని, రాజకీయాలు, వర్గ విభేదాలు లేకుండా అందరూ కలిసి మెలిసేలా సంబరాలు జరుగుతున్నాయన్నారు. ఏటా దీక్షతో రాజకీయాలకు అతీతంగా అంబటి రాంబాబు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రతిపక్షాలకు సీఎం జగన్, మంత్రి అంబటి రాంబాబును టార్గెట్ చేసుకుంటున్నారని ప్రజల అండదండలు చూస్తే అవేమీ పెద్ద లెక్క కాదని పేర్కొన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ సంక్రాంతి అంటే రైతుల ఉత్పత్తులు ఇంటికి వచ్చి సందడిగా జరుపుకునే పండుగ అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ముగ్గుల పోటీలు నిర్వహించి లక్షలాది రూపాయలు బహుమతులు అందజేయడం అభినందనీయమని చెప్పారు. సత్తెనపల్లిలో నిర్వహించే సంక్రాంతి సంబరాలు ప్రజలందరికీ గుర్తు ఉంటాయని చెప్పారు. విజయవాడ మేయర్ రాయని భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కనుమరుగవుతున్న సంస్కృతి సంప్రదాయాలను వెలికి తీయడంతో పాటు మహిళలను ప్రోత్సహించి భాగస్వాములను చేయడం అభినందనీయమన్నారు. ఐదు రోజులు ముందుగానే సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుపుకోవడం, మహిళలను ప్రోత్సహిస్తున్న మంత్రి అంబటి రాంబాబును కొనియాడారు. ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి తెలుగువారి గొప్ప పండుగని, ముగ్గులు వేయడం వల్లన మహిళలు ఎంతో ప్రావీణ్యం పొందుతారన్నారు. సభలో గుంటూరు మాజీ డెప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, విజయవాడ కార్పొరేటర్ చైతన్య రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరు వెంకటరెడ్డి, డాక్టర్ గీతాహసంతి, డాక్టర్ షకీలా శ్రీధర్ మాట్లాడారు.





ముగ్గులను పరిశీలిస్తున్న మంత్రి అంబటి, ఎమ్మెల్సీ మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యే నంబూరు, కోళ్ల కొట్లాటను తిలకిస్తున్న నేతలు

ముగ్గుల పోటీల విజేతలు వీరే....



విజేతకు చెక్కు అందజేస్తున్న మంత్రి అంబటి, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీల్లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో 24 మంది మహిళలు పోటీ పడగా ప్రథమ స్థానం నకరికల్లుకు చెందిన టైలర్ పి.తిరుపతమ్మ, ద్వితీయ స్థానం పోలా శ్రీలత, తృతీయ స్థానం ఉయ్యాల సుహాసిని, చతుర్ధ స్థానం పి.రామలింగేశ్వరి కైవసం చేసుకోగా వారికి వరుసగా రూ.2 లక్షలు, రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25వేలు నగదు చెక్కులను పంపిణీ చేశారు. ఐదో స్థానం సాధించిన సామినేని శిరీషకు కన్సోలేషన్ బహుమతి కింద వాషింగ్ మిషన్ బహూకరించారు. అలాగే లక్కీడిప్ నిర్వహించి 114 మందికి బహుమతులు ప్రకటించారు. తొలుత సంక్రాంతి సంబరాల్లో భాగంగా పల్నాడు బ్రహ్మనాయుడు, నాయకురాలు నాగమ్మ పేరుతో కోడిపందెం నిర్వహించారు. అరిసెలు, గారెలు, పూర్ణాలు, పాలతాలికలు, పులిహోర వచ్చిన ప్రజలందరికీ అక్కడికక్కడే తయారు చేయించి పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో గుంటూరు డెప్యూటీ మేయర్ బాల వజ్రబాబు, నియోజకవర్గ పరిశీలకుడు వెన్నా హనుమారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ చలంచర్ల లక్ష్మీ తులసి, జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ, ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జై బూన్ బీ, నాయకులు చలంచర్ల సాంబశివరావు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, రాయపాటి పురుషోత్తమరావు, కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, అచ్చుత శివప్రసాద్, మర్రి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆటో ఢీకొని చిన్నారి మృతి



పట్నంబజారు: అతివేగం చిన్నారిని బలిగొంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. గుండారావుపేటకు చెందిన గోన అవిక(4) తల్లిదండ్రులు సతీష్‌కుమార్, రమాదేవి కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. అయితే గురువారం సతీష్‌కుమార్ నివాసానికి బంధువులు వచ్చి తిరిగి వెళుతున్న క్రమంలో అవిక కూడా వారితో కలిసి బయటకు వెళ్ళింది. దర్గా సమీపంలో డివైడర్ దాటుతున్న క్రమంలో దర్గా వైపు నుంచి వెళుతున్న రేషన్ బియ్యం సరఫరా ఆటో అతివేగంగా వచ్చి చిన్నారిని ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన అవికను ప్రభుత్వాసుపత్రి తీసుకుని వెళ్ళగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చిన్నారి మేనత్త పేర్ని సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి హత్య కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

పొన్నూరు: విద్యార్థిని హత్య చేసిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష పడింది. రూరల్ సీఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వల్లభరావుపాలెం గ్రామంలో 2016 సంవత్సరంలో పాలిటెక్నిక్ విద్యార్థి నవీన్‌బాబుపై దాడి చేసి హత్య చేసిన కేసులో నిందితుడు తాడిపత్రి రవికి గురువారం కోర్టు 10 సంవత్సరాలు జైలు శిక్ష రూ.వెయ్యి జరిమానా విధించిందన్నారు. 3వ గుంటూరు అదనపు జిల్లా కోర్టు పై శిక్ష విధించిందని రూరల్ సీఐ ప్రభాకర్ చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

దాచేపల్లి: కేసానుపల్లి రైల్వేగేట్ సమీపంలో రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. కేసానుపల్లికి చెందిన షేక్ ఖాసీం సైదా(44) అనారోగ్య కారణాలతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని జీఆర్పీ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

తెనాలిలో జాబ్‌మేళాకు విశేష స్పందన



అపాయింట్‌మెంట్ లెటర్ అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

- పెద్ద సంఖ్యలో హాజరైన నిరుద్యోగులు
- 23 కంపెనీల్లో 455 మందికి ఉద్యోగాల కల్పన

తెనాలి: ఆంధ్రప్రదేశ్ డిపార్టుమెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో ఏర్పాటైన జాబ్‌మేళాలో వివిధ రకాలైన 23 కంపెనీలు సాయంత్రం వరకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో మొత్తం 455 మందికి ఉద్యోగాలు లభించాయి. రాత్రి ఆరున్నర గంటల సమయంలో ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులకు ఎమ్మెల్యే శివకుమార్ స్వయంగా జాబ్ ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిరుద్యోగ అభ్యర్థులకు ఉపాధి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వ సహకారంతో జాబ్ మేళాను ఏటా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2020లో 750 మందికి, 2021లో వెయ్యిమందికి ఉద్యోగాలను కల్పించగా, 2022లో ఒమిక్రాన్ వైరస్ హెచ్చరికలతో సాధ్యం కాలేదన్నారు. మళ్లీ 2023 సంవత్సరానికి జరిపిన జాబ్‌మేళాలో 455 మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. అవకాశం ఎప్పుడూ రాదని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శివకుమార్ సూచించారు. రాష్ట్రంలోని ప్రజలకు అనేక రకాలుగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జాబ్‌మేళాలను ఏర్పాటుచేస్తూ, ఉపాధిని కల్పిస్తున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి బాటలోనే తాను కూడా నిరుద్యోగుల ఉపాధి కల్పనకు కృషిచేస్తున్నట్టు వివరించారు. ప్రారంభ సభకు డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ అధ్యక్షత వహించారు. జిల్లా ఉపాధి అధికారి రఘు కూరమ్, ఏపీఎస్ఎస్‌డీసీ డీఎస్‌డీఓ ప్రణయ్, సీడాప్ జేడీఎం శివప్రసాద్‌రెడ్డి, తెనాలి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రావి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను గురువారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య కేవీ శాంతిశ్రీ మాట్లాడుతూ 'వైలెన్స్, యాస్ ఇంపిడిమెంట్ టూ ఉమెన్ ఎంపవర్‌మెంట్' అనే అంశంపై ఫిబ్రవరి 13,14 తేదీలలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలు, యూనివర్సిటీల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, పలువురు అధికారులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

ఎంపీ నందిగం సురేష్



ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఉద్యోగులు

ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ పేర్కొన్నారు. ఉద్దండరాయునిపాలెంలోని తన నివాసంలో గురువారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ బాపట్ల జిల్లా 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా విన్నారు. స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళిఅన్ని సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినుకొండ రాజారావు, జిల్లా అధ్యక్షుడు కూరపాటి సత్యం రాజు, కార్యదర్శి బడుగు శివాజీ, కోశాధికారి ఎస్.పుల్లారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పి. సిద్దార్థ, సలహాదారుడు ఎన్‌కేవీ ప్రసాద్, ప్రకాష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎస్టీఎఫ్ బాధ్యతతో విధులు నిర్వర్తించాలి



కానిస్టేబుల్‌కు నూతన యూనిఫాం అందిస్తున్న ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: విధి నిర్వహణలో ఎస్టీఎఫ్ పోలీస్ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అన్నారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో స్పెషల్ టీం ఫోర్స్ (ఎస్టీఎఫ్) పోలీస్ దర్బార్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిరంతరం విధుల్లో నిమగ్నమయ్యే ఎస్టీఎఫ్ సిబ్బంది సంక్షేమానికి పోలీస్‌శాఖ తరపున కృషి చేస్తామని పేర్కొన్నారు. వృత్తి, ఆరోగ్య పరమైన అర్జీలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విధులకు ఎవరైనా అనధికారికంగా గైర్హజరైతే క్రమశిక్షణను ఉల్లంఘిస్తే సహించేదిలేదని ఆయన హెచ్చరించారు. ఒక్కొక్క సిబ్బందితో విడివిడిగా మాట్లాడారు. అనంతరం సిబ్బందికి ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు(క్రైం) ఎ.శ్రీనివాసరావు, కె.కోటేశ్వరరావు (ఏఆర్), ఆర్ఐలు థామస్‌రెడ్డి, రాఘవయ్య, రమేష్‌కృష్ణన్, ఎస్బీ సీఐ బి.నరసింహారావు, సీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫార్మా క్రికెట్ చాంపియన్ 'నిప్స్'

విజ్ఞాన్ ఫార్మసీలో ముగిసిన జాతీయస్థాయి క్రికెట్ పోటీలు

చేబ్రోలు: ఫార్మా క్రికెట్ చాంపియన్స్ టోర్నమెంట్-2కే23 జాతీయ స్థాయి క్రికెట్ ట్రోఫీని నిప్స్ (నరసరావుపేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్స్) ఫార్మసీ కళాశాల జట్టు గెలుపొందింది. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ఫార్మా క్రికెట్ చాంపియన్స్ టోర్నమెంట్- 2కే23 జాతీయ స్థాయి పోటీలు గురువారం ముగిశాయి. విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నిప్స్ ఫార్మసీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసబాబు ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. తొలుత ఫార్మా క్రికెట్ చాంపియన్స్ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 116 పరుగులు చేసింది. లక్ష్యఛేధనలో నిప్స్ ఫార్మసీ కళాశాల జట్టు 9.5 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 117 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. బ్యాటింగ్‌లో నిప్స్ ఫార్మసీ కళాశాల ఆటగాడు నవీన్ 57 పరుగులతో అజేయంగా నిలిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

క్లుప్తంగా

ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



గుంటూరు వెస్ట్: ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించామని వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ లాల్ వజీర్ తెలిపారు. అధ్యక్షుడిగా పెద్ది శివరామ్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ముప్పల రామారావు, కార్యదర్శి వై.లక్ష్మి, సంయుక్త కార్యదర్శిగా సీహెచ్.శ్రీనివాసరావు, కో–ఆర్డినేటర్‌గా రత్నం, గౌరవ సలహాదారుడిగా చెలికాని సీతారామయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రమణ ఎస్.వి., గ్రంధి హనుమంతరావు, శ్యామల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన పంచరత్న కీర్తనలు



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 176వ సద్గురు శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీ త్యాగరాజస్వామి ఆలయంలో శ్రీ సీతారాములకు, శ్రీ త్యాగరాజుకు విశేష అభిషేకార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక కళాకారులు, వాయిద్య కళాకారులు పంచరత్న సేవతో శ్రీ త్యాగరాజ స్వామిని కొలిచారు. నేమాని నాగలక్ష్మి బృందం శ్రీ త్యాగరాజ చరితం హరికథా గానం సంగీత అభిమానుల్ని అలరించింది.

పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

పట్నంబజారు: వివాదం నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదైంది. కొత్తపేటలోని గణేశ్వరరావు వీధిలో పసుపులేటి శివశంకర్, షేక్ సుభాని, పఠాన్‌ఖాన్ మధ్య జరిగిన పలు వివాదాల నేపథ్యంలో ఒకరిపై ఒకరితో పాటు మరికొంత మంది కలసి రెండు వర్గాలుగా ఏర్పడి దాడులు చేసుకున్నారు. ఇందులో గాయపడి ఇద్దరు ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందారు. పసుపులేటి శివశంకర్, సుభాని భార్య రత్నమాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గుంటూరు ఈస్ట్: జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వృద్ధుడి మృతిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. దేవాపురం 2వ లైనులో నివసించే మేకల కృష్ణ (62) కొద్ది రోజుల కిందట మెట్ల మీద నుంచి జారిపడి గాయపడ్డాడు. జీజీహెచ్‌లో చికిత్స పొందాడు. ఆ తర్వాత ఇంట్లో వేడి నీరు చేతి మీద పడి తీవ్ర గాయమైంది. దానికి ఇన్‌ఫెక్షన్ సోకి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు చానల్‌లో వ్యక్తి గల్లంతు

పెదకాకాని: గుంటూరు చానల్‌లో స్నానానికి దిగి వ్యక్తి గల్లంతైన సంఘటన పెదకాకాని శివారు చోటు చేసుకుంది. సంకూరివారిపేటకు చెందిన బొట్టు బాబ్జి వంట పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్నానం నిమిత్తం గురువారం మరో ఇద్దరు స్నేహితులతో కలసి పెదకాకాని శివారులోని గోళ్లమూడి రోడ్డులో ఉన్న గుంటూరు చానల్ (కొత్త కాలువ)కు వెళ్లాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తూ నీటిలో పడి గల్లంతు అయ్యాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని బాబ్జి(35) కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

గణేష్ నగర్ రోడ్లకు మహర్దశ



గుంటూరు రూరల్: నగరంలోని శివారు కాలనీల్లో సైతం సకల సౌకర్యాల్ని కల్పించి వాటి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని 48వ డివిజన్ రెడ్డిపాలెం కార్పొరేటర్ తనబుద్ధు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని గణేషనగర్‌లో గురువారం రూ. 27 లక్షలతో నూతనంగా నిర్మించనున్న రోడ్డు, సీసీ డ్రెయిన్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు విలీన గ్రామాల్ని పట్టించుకోలేదని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో 90 శాతానికి పైగా రోడ్లు, సీసీ డ్రెయిన్లు, తాగునీరు వంటి సౌకర్యాల్ని కల్పించినట్లు తెలిపారు. ప్రతి కుటుంబాన్నీ ఆర్థికంగా అభివృద్ధి చేయడమే జగనన్న లక్ష్యమని, అందుకే అనేక సంక్షేమ పథకాల్ని ప్రతి ఇంటికీ చేరుస్తున్నారని వివరించారు. ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా నిలిచి రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం సీఎం జగన్ ధ్యేయం

ఎమ్మెల్యే ముస్తఫా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా, పక్కన శేషు తదితరులు

పట్నంబజారు: ప్రతి గడపకూ సంక్షేమం, అభివృద్ధి చేరాలనే ఆకాంక్షతోనే సచివాలయ, వలంటీర్, గృహసారథుల వ్యవస్థకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం వలంటీర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, వాటిపై అవగాహన కల్పించేందుకు వలంటీర్లు, గృహ సారథులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తద్వారా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో తెలుస్తుందని చెప్పారు. కాపు కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ పరిశీలకుడు అడపా శేషు మాట్లాడుతూ చిత్తశుద్ధితో ప్రజలకు పారదర్శక పాలన ఎలా అందివచ్చో.. సీఎం జగన్ చేసి చూపించారన్నారు. గత ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతోందని వివరించారు. సమావేశంలో డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, నియోజకవర్గ మహిళా నేత షేక్ నూరిఫాతిమా, కార్పొరేటర్లు ఖాజామొహిద్దీన్ చిష్టి, షేక్ ఫర్హానా, సంకూరి శ్రీను, దూపాటి వంశీ, పాపతోటి అంబేడ్కర్, మల్లవరపు రమ్య, పూనూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు సలీమ్, దాసు, షంషేర్, యాదాల చిన్న, రాజేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు

పట్నంబజారు: గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా తెలుసుకున్న ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని, తద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని 53వ డివిజన్ వసంతరాయపురంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికుల సమస్యల్ని తెలుసుకోవడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. వసంతరాయపురంలోని పలు వీధుల్లో రోడ్లు, కాల్వలు లేకపోవడాన్ని గమనించిన ఎమ్మెల్యే ముస్తఫా, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతో వాటిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు నేరుగా తెలుసుకోవడంతో పాటు వాటిని పరిష్కరించే వరకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏ రాష్ట్రంలో అమలు కాని విధంగా, అనేక సంక్షేమ పథకాల్ని సీఎం వై.ఎస్. జగన్ ప్రజలకు అందజేస్తున్నారని చెప్పారు. కేవలం అర్హతే ఉంటే సంక్షేమం నేరుగా ఇంటి గడప వద్దకు చేరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, కార్పొరేటర్లు దూపాటి వంశీ, పాపతోటి అంబేడ్కర్, నియోజకవర్గ మహిళా నేత నూరిఫాతిమా, వైఎస్సార్ సీపీ నేతలు దూపాటి సాల్మన్, జయప్రకాష్‌రెడ్డి, చెన్నుపాటి శ్రీను, పాదిల శ్రీను, వెంకట్, నాని, బండారు ప్రసాద్, వెంకట్రావు, ఫణి, రమేష్, సుధాకర్, మరియమ్మ పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు పంపిణీ



సావిత్రికి చెక్కును అందజేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో కార్మికులకు అండగా ఉంటామని, పరిహారాల్ని వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ఇంజినీరింగ్ విభాగ కార్మికుడి భార్యకు ఎక్స్‌గ్రేషియా చెక్‌ని ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో అవుట్ సోర్సింగ్ కార్మికుడిగా పని చేస్తున్న చిరుమామిళ్ల రాజారావు ఇటీవల కాలంలో మరణించారని, ఆయన భార్య సావిత్రికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేసినట్లు చెప్పారు.

చెత్త సేకరణ సమర్థంగా చేపట్టాలి

నగరంలో చెత్త సేకరణ సమర్థంగా చేపట్టాలని, తడి, పొడిగా వేర్వేరుగా చేయాలని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో గురువారం ప్రజారోగ్య విభాగ అధికారులతో, జూమ్ ద్వారా శానిటేషన్ కార్యదర్శులతో నగరంలో పారిశుద్ధ్య పనులు, ఇంటింటి చెత్త సేకరణ, ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలు మూడు డస్ట్‌బిన్లు వాడే విధంగా వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజల్లో అవగాహన కలిగించి ఆర్టీసీ కాలనీ భాష్యం స్కూల్ దగ్గర గార్బేజ్ వల్నరబుల్ పాయింట్‌ని లిట్టర్ ఫ్రీగా మార్చిన సచివాలయం 4, 5, 6 కార్యదర్శులను అభినందించారు. కార్యదర్శులంతా విధుల్లో శ్రద్ధ చూపాలని ఆమె చెప్పారు. ప్రజలకు హోం కంపోస్ట్ తయారీ, ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. అపార్ట్‌మెంట్స్‌లో క్లస్టర్ కంపోస్ట్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గుంటూరు నగరం మెరుగైన ర్యాంక్ సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కమిషనర్ చెప్పారు. సమావేశంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ భానుప్రకాష్, ఈఈ కొండారెడ్డి, డీఈఈ హనీఫ్, యస్‌యస్‌లు ఆనందకుమార్, రాంబాబు, అయూబ్ ఖాన్, సోమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మిఠాయి దుకాణంపై రెండు కేసులు నమోదు



కొత్తపేటలోని షాపులో తనిఖీ నిర్వహిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

నెహ్రూనగర్: తూకాల్లో తేడా వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి హెచ్చరించారు. డెప్యూటీ కంట్రోలర్ షాలేం రాజుకు అందిన ఫిర్యాదు మేరకు కొత్తపేటలోని సాయి అభిలాష్ మిఠాయి దుకాణంలో గురువారం కాటాల్ని తనిఖీ చేశారు. తూకంలో తేడాతో పాటు కాటాలకు స్టాంపింగ్ లేకపోవడం గమనించి రెండు కేసులు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. తనిఖీల్లో సిబ్బంది సైదా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ధార్మిక ప్రాంగణంలోని యాగశాలలో భారతి ధార్మిక విజ్ఞాన్ పరిషత్, ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో విశ్వశాంతి, లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ గురువారం ద్విశతి చండీ హోమం, మహాపూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పదకొండు మంది రుత్వికులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పరిషత్ వ్యవస్థాపకులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య పర్యవేక్షించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాల్ని స్వీకరించారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్‌బాబు

పాత గుంటూరు: ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో గురువారం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు పాల్గొని మాట్లాడారు. విభజన చట్టంలోని హామీల్ని కేంద్రం నెరవేర్చాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. వీటి సాధనకై ఈనెల 20వ తేదీ నుంచి శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి ఫిబ్రవరి 4 వరకు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు బస్సు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 26న గుంటూరుకు వస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, సీపీఎం నాయకులు ఈమని అప్పారావు, కాంగ్రెస్ నాయకులు షేక్ మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణ, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతికి నిలువుటద్దం సంక్రాంతి పర్వదినం



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి



ఏంజెల్ కిట్టీ మహిళా సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో పాల్గొన్న మహిళలు



చలమయ్య కళాశాలలో భోగి మంటలు

పట్నంబజారు: తెలుగు సంస్కృతీ, సంప్రదాయాల్ని భవిష్యత్తు తరాలకు తెలియజెప్పాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు తెలిపారు. నియోజకవర్గంలోని ఆర్టీసీ కాలనీలో గురువారం కన్నా విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంబరాల్లో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణలు ఆహుతుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంప్రదాయాలకు పుట్టినిల్లు మన రాష్ట్రమని, కచ్చితంగా చిన్నారులకు మన పండుగల విశిష్టతను పెద్దలు తెలియజెప్పాలన్నారు. భోగిమంటలు, రంగురంగుల ముగ్గులు, పిండివంటలు, సరదాల అల్లర్ల మధ్య కలిగే సంతోషాల లోగిళ్లలో ప్రతి ఒక్కరూ చేసుకునే పండుగ సంక్రాంతి అని చెప్పారు. కార్యక్రమంలో కన్నా మాస్టార్, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలమయ్య కళాశాలలో సంక్రాంతి సంబరాలు

గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య–కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో గ్రామీణ వాతావరణాన్ని తలపించే విధంగా అందమైన రంగ వల్లులతో తీర్చిదిద్ది గొబ్బెమ్మలను ఉంచారు. అధ్యాపకులు, విద్యార్థులు సంప్రదాయ వస్త్రాల్ని ధరించి భోగి మంట వేశారు. హరిదాసు గానం, బొమ్మల కొలువు, గంగిరెద్దుల విన్యాసం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు, కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు, బాపూజీ కమిటీ అధ్యక్షుడు సాధు శివశంకర్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏంజెల్ కిట్టీ మహిళా సంఘం ఆధ్వర్యంలో..

పాత గుంటూరు: శ్యామలానగర్ 3వ లైనులోని అపార్ట్‌మెంట్‌లో ఏంజెల్ కిట్టీ మహిళా సంఘం అధ్యక్షురాలు ఓలేటి షర్మిల ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, బొమ్మల కొలువు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి చీతిరాల ఇందిరాదేవి, యక్కల రేవతి, ఆత్మకూరు లక్ష్మి, తెల్లాకుల సీత, మద్దు జయలక్ష్మి, కాకుమాను రమ, పర్చూరు లక్ష్మి, పాదర్తి ఆషా పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ చట్టం గడువును పొడిగించాలి

నెహ్రూనగర్: ఈ ఏడాది ముగుస్తున్న ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం– 2013 కాలపరిమితి పెంచాలని, ఆయా వర్గాలు అభివృద్ధి చెందే వరకు పొడిగించాలని ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ మేడిద బాబూరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ సబ్ ప్లాన్ చట్టం నిధుల్ని గత ప్రభుత్వంలో సక్రమంగా వినియోగించలేదని ఆరోపించారు. ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయించే నిధుల్ని జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే ఖర్చు చేసి వారి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. నిధులు దుర్వినియోగం కాకుండా ప్రత్యేక అధికారిని కూడా నియమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై దాడుల్ని అరికట్టడంతో పాటు తప్పుడు ఫిర్యాదులతో వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారుఉ. సమావేశంలో అసోసియేషన్ నాయకులు ఎస్. ఐజక్, కె. సునీల్ కుమార్, సీహెచ్. సుశీల్ కుమార్, కె. నాగేశ్వరరావు, పి. గాబ్రియేల్, రాజేష్ పాల్గొన్నారు.

నగరంలో పచ్చదనం పెంపునకు కృషి

మేయర్ కావటి



పార్కును ప్రారంభిస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే ముస్తఫా, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడానికి నగరపాలక సంస్థ ప్రత్యేక కృషి చేస్తోందని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. ఆర్టీసీ కాలనీ 5వ లైన్‌లో గురువారం రూ.42 లక్షలతో అభివృద్ధి చేసిన మున్సిపల్ కార్పొరేషన్ పార్కును ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, కమిషనర్ కీర్తి చేకూరితో కలసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పెంపునకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, అందులో భాగంగా ఆర్టీసీ కాలనీ 5వ లైన్‌లో అర ఎకరంలో స్థానికులకు ఉపయోగపడేలా, ఆహ్లాదం, ఆరోగ్యం అందించేలా పార్కును అభివృద్ధి చేశామని తెలిపారు. ఇప్పటికే కాలనీలో ఒక పార్కు ఉన్నప్పటికీ, మరొక పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇదే ప్రాంతంలో త్వరలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే ఆర్టీసీ కాలనీలో పార్కును అభివృద్ధి చేయడం అభినందనీయమని తెలిపారు. నగరంలో పచ్చదనం పెంపు ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ని అందించవచ్చని చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని కాలనీల్లో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. గాంధీ పార్కు పనులు కూడా వేగంగా జరిగేలా ఈఈ స్థాయి అధికారికి ప్రత్యేక పర్యవేక్షణ బాధ్యతలు కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, స్థానిక కార్పొరేటర్ కె.రంగారెడ్డి, ఏడీహెచ్ రామారావు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ కల్యాణరావు, ఏఈ సేతుబాబు, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి సంబరాల్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధ, గురువారాల్లో నగరపాలక సంస్థ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు సంక్రాంతి సంబరాల ముగింపు రోజైన 15న స్టేడియంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా మెమెంటోలు, ప్రశంసా పత్రాల్ని అధికారులు అందజేయనున్నారు.

నేడు ఎన్టీఆర్ స్టేడియంలో ముగ్గుల పోటీలు

నగరపాలక సంస్థ సంక్రాంతి సంబరాలలో భాగంగా ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. సందేశాత్మక ముగ్గులలో ఎంపికైన మొదటి, ద్వితీయ, తృతీయ విజేతలకు ప్రత్యేక బహుమతులను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు, విద్యార్థినులు పాల్గొనాలని ఆయన కోరారు. సంక్రాంతి సంబరాల ప్రత్యేక పర్యవేక్షణ అధికారి, డెప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ ముగ్గుల పోటీలకు వచ్చేవారు రంగుల్ని తెచ్చుకోవాలని సూచించారు. పోటీలను ఉదయం 8 గంటల నుంచి ప్రారంభిస్తామని, పాల్గొనదలచిన వారు ముందుగా వచ్చి ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమాచార కేంద్రంలో (హెల్ప్ డెస్క్) పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ముగ్గుల పోటీలతో పాటు శుక్రవారం క్రీడా ప్రాంగణంలో ఉదయం మ్యూజికల్ చైర్ గేమ్స్, పాటల పోటీలు, మిమిక్రీ, మ్యూజిక్, మైమ్ పోటీలు సాయంత్రం రుద్రకళా క్షేత్రం కర్ర సాము ప్రదర్శన, నాట్య విశారద మాచిరాజు రాజేష్ కూచిపూడి, జానపదం, భారత నాట్యం ప్రదర్శన, కాసుల కృష్ణారావు, అంజన్ కుమార్ మిమిక్రీ ప్రదర్శన, టాకింగ్ డాల్, మ్యాజిక్ షో తదితర ప్రదర్శనలు ఉంటాయని వివరించారు.

వివేకానంద బోధనలు యువతకు మార్గదర్శకాలు



యూనివర్సిటీలో వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆంజనేయులు



వివేకానంద చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు

ఏఎన్‌యూ: చిన్న వయస్సులోనే భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని నాగార్జున యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ జీవీఎస్ఆర్ ఆంజనేయులు సూచించారు. యూనివర్సిటీ స్టాటిస్టిక్స్ విభాగంలో గురువారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. అధ్యాపకులు, పరిశోధకులు, సిబ్బంది వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ 1984 నుంచి భారత ప్రభుత్వ ఆదేశానుసారం భారతీయులందరూ స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నారని వివరించారు.

స్వామి వివేకానంద జీవితం ఆదర్శనీయం

గుంటూరు మెడికల్: భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచవ్యాప్తంగా తెలియజేసిన స్వామి వివేకానంద జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నేత, ప్రముఖ ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణుడు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ సూచించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గురువారం ఆటోనగర్‌లోని డాక్టర్ ఉమాశంకర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మాగంటి సుధాకర్ యాదవ్, భీమినేని చంద్రశేఖర్, కుమార్‌గౌడ్, మాధవరెడ్డి, సురేష్‌కుమార్ జైన్, దినేష్‌జైన్, శేషగిరిరావు, శ్రీనివాస్, బాబూరావు, పోతురాజు వెంకట్ పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పథకాలు

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న సుచరిత

వల్లూరు(కాకుమాను): ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాల్ని అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో సచివాలయాల్ని ఏర్పాటు చేసినట్లు ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత తెలిపారు. మండలంలోని వల్లూరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను గురువారం ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో పాటు రైతులు, ప్రజల సమస్యల్ని అక్కడికక్కడే పరిష్కరించాలనే లక్ష్యంతో గ్రామాల్లో సచివాలయాల్ని ఏర్పాటు చేసి కొన్ని లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిన ఘనత దేశ చరిత్రలో ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని ఆమె తెలిపారు. సచివాలయాల్లో దాదాపు 413 రకాల సేవల్ని అందిస్తున్నట్లు చెప్పారు.గతంలో ఏ పనికైనా మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు ప్రజలకు ఆ అవస్థ తప్పిందని పేర్కొన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ఆధారంగా పింఛన్లు మంజూరు చేస్తుంటే, కొన్ని పత్రికలు తప్పుడు రాతలు రాస్తున్నాయని సుచరిత మండిపడ్డారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు ముజావర్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ వింతా రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తియ్యగూర వెంకటరెడ్డి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ పొన్నూరు షేక్ కరీముల్లా, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మెరిగల రవిబాబు, మునగాల వీరారెడ్డి, మాజీ సర్పంచ్ ముప్పా గంగిరెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆళ్ల శివకోటిరెడ్డి, లింగంగుంటపాలెం సర్పంచ్ చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓశరత్‌బాబు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో వాహన చోరులు?

పెదకాకాని: ద్విచక్ర వాహనాల చోరుల్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలోని శివాలయం, గడ్డిపాడు ప్రాంతాల్లో ఇటీవల రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. వీటిపై నిఘా పెంచిన పోలీసులు గురువారం నలుగురిని అదుపులోకి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువర్స్

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి



త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...

* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్–ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్–ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్–ప్రొఫైల్ పోస్ట్స్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్–ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.

వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్‌కింగ్

పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....


ప్రణయ్ పటేల్

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంత వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్ ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

> దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్‌క-రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

■ పెద్ద పండగ

పండగపూట పల్లెటూర్




● మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.

● పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!

●గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.

■ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్



డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..

డి ప్రో
స్క్రీన్: 1.85 అంగుళాలు **రిఫ్రెష్ రేట్:** 60 హెచ్‌జెడ్ **పవర్:** డిజో డీఐ చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ **ధర:** ₹ 2,699

డి అల్ట్రా
స్క్రీన్: 1.78 అంగుళాలు **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **రిజల్యూషన్:** 368×448 పిక్సెల్స్ **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **మోడ్స్:** 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్–ఔట్‌డోర్) **కలర్స్:** క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఒషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ **బ్యాటరీ:** 8000 ఎంఏహెచ్
వోఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
● ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమొరీ: 128 జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్


● కేట్ విన్స్‌లెట్, లియొనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియొనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచరీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి
- 'దిల్' రాజు


● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నప్పుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ– ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు
- దేవిశ్రీ ప్రసాద్



''వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదరగొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు'' అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

● చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.

● బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.

● ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంట తడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడ దని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.

● ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.


● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి
- బాలకృష్ణ

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు–వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

క్రైమ్.. థ్రిల్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.


● అభిరామ్

రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి
- దేవీ ప్రసాద్


● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ– ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...


● రవీంద్ర

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.